మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# విద్యా వ్యవస్థకు స్వర్ణయుగం

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి**

**ఎంపీ డీకే అరుణతో కలిసి అదనపు తరగతి గదుల ప్రారంభం**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 8 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థకు స్వర్ణయుగం ప్రారంభమైందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గం, హన్వాడ మండలంలోని గొండ్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులను ఎంపి డికె అరుణతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం పదవ తరగతిలో డిజిటల్ బోర్డు ద్వారా డిజిటల్ కంటెంట్ వినియోగవిధానాన్ని ఎంపితో కలిసి పరిశీలిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం సొంత నిధులతో డిజిటల్ కంటెంట్ విద్యార్థులకు ఉచితంగా అందించామని అందువల్ల ఫలితాలు మెరుగ్గా వచ్చా యని తెలిపారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో ప్రధానంగా విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అనంతరం గొండ్యాల గ్రామంలో కొలువైన శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఎంపి కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, వేముల కృష్ణయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి మహేందర్, నాయకులు రామకృష్ణ, వేంకటాద్రి, తహసీల్దార్ కిష్ట్యానాయక్, ఎంపిడిఓ యశోద, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ మాస్టర్, ఎఇ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న దృశ్యం

# 16 క్వింటాల్ పిడిఎస్ బియ్యం పట్టివేత

**కేసు నమోదు చేసిన పోలీసులు**

**ఇటిక్యాల, జనవరి 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని సాతర్ల గ్రామ శివారులో ఓ వాహనంలో తరలిస్తున్న 16 క్వింటాల్ పిడిఎస్ బియ్యాన్ని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. వారి వివరాల మేరకు బుధవారం ఉదయం ఇటిక్యాల పోలీసులు మున్సార్ పాష, దాసునాయుడు రోజువారి విధి నిర్వహణలో భాగంగా వావిలాల గ్రామానికి వెళుతుండగా అదే దారిలోని సాతర్ల గ్రామ శివారులోని రోడ్డుపై వాహనం కనిపించగా పోలీసులను చూసి ఆ వాహన డ్రైవర్ చూసి వాహనాన్ని వదిలి వెళ్లారు. వాహనాన్ని పోలీసులు తనిఖీ చేయగా అందులో 40 ప్లాస్టిక్ సంచుల ఉండగా అవి దాదాపు 16 క్వింటాల్ పిడిఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఆ వాహనాన్ని ఇటికాల పోలీస్ స్టేషన్‌కు తరలించి పోలీస్ కానిస్టేబుల్ మున్సార్ పాష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.



పట్టుకున్న వాహనంలో ఉన్న పిడిఎస్ బియ్యం

# సైన్స్ లేనిదే అభివృద్ధి లేదు

**మంచి, చెడు రెండు సైన్స్‌తోనే సాధ్యం : పూర్వీకుల ఆహారమే గొప్పది**

**రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లాల చిన్నారెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 8 ప్రబాతవార్త:** పూర్వీకుల ఆహారమే చాలా గొప్పదని జొన్నలు, సజ్జలు, తైదలు, కొర్రలు వంటి చిరుధాన్యాలు తింటూ శ్రమిక జీవనాన్ని కొనసాగించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని ఎస్‌వికేఎం పాఠశాలలో కొనసాగుతున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో చిరుధాన్యాల ప్రాధాన్యతపై ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. సైన్స్ లేనిదే అభివృద్ధి లేదని సైన్స్ మానవాళి జీవితాలని మార్చిందన్నారు. సంచార జీవనం నుండి ఆధునిక మానవుడి దాకా ఎన్నో పరిణామాలు జరిగాయని దీని వెనక శాస్త్రవేత్తల కృషి ఎంతో ఉందన్నారు. వ్యవసాయంతోనే మానవ నాగరికత అభివృద్ధి చెందిందని చెప్పారు. మంచి చెడు రెండు సైన్స్ ద్వారానే సాధ్యమవుతుందన్నారు. అంతకముందు పాఠశాలలో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చి ఏర్పాటుచేసిన ఆవిష్కరణలను ఆసక్తిగా తిలకిస్తూ చిన్నారులతో సరదాగా మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఓ రవీందర్ సీఎంవో బాలు యాదవ్ డిఎస్ఓ శ్రీనివాస్ ఏ ఎం ఓ దుంకుడు శ్రీనివాస్, ఎంఈఓ మంజులదేవి, ఐ ఎన్ పి ఆర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇస్రా నాయక్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సదాశివయ్య, చక్రవర్తి గౌడ్, రమణాచార్య తదితరులు పాల్గొన్నారు.



చిన్నారుల ప్రదర్శనలను తిలకిస్తున్న చిన్నారెడ్డి

## తుంగభద్ర డ్యాం నుండి

# సాగునీటి విడుదల

**ఏపీ అధికారులతో మాట్లాడి నీటిని విడుదల చేయించిన**

**ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు**

**ఇటిక్యాల జనవరి 8 ప్రభాతవార్త:** అలంపూర్ నియోజకవర్గంలోని రైతులు ఆర్డీఎస్ తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం ద్వారా సాగు చేస్తున్న రెండవ పంట తుంగభద్ర నదిలో నీటిమట్టం తగ్గిపోవడంతో పంటలు ఎండిపోతుండగా పంటలకు సాగునీరు విడుదల చేయించాలని రైతులు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి, అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు దృష్టికి తీసుకుపోవడంతో స్పందించిన ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే తుంగభద్ర డ్యాం అధికారులతో, ఆర్డీఎస్ ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి ఆర్డీఎస్ ప్రాజెక్ట్ రెండో ఇండెంట్ లో భాగంగా 1టిఎంసి నీటిని విడుదల చేయాలని అధికారులను కోరారు. స్పందించిన అధికారులు తుంగభద్ర డ్యాం నుండి బుధవారం నీటిని విడుదల చేశారు. మరో మూడు రోజుల్లో ఆర్డీఎస్, తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం వరకు సాగునీరు వచ్చే అవకాశం ఉన్నదనీ ఎమ్మెల్సీ చల్లా వెంకట్రాంరెడ్డి.ఎమ్మెల్యే విజయుడు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు బుధవారం ఫోన్లో మాట్లాడి తుంగభద్ర డ్యామ్ నుండి ఏపీకి రావాల్సిన రెండవ ఇండెంట్ సాగునీటి విడుదలకు ప్రతిపాదనలు తుంగభద్ర డ్యామ్ అధికారులకు పెట్టాలని ఎమ్మెల్యే ఎమ్మెల్సీ అధికారులను కోరారు. స్పందించిన అధికారులు ఏపీకి రావాల్సిన సాగునీటి విడుదలకై తుంగభద్ర డ్యామ్ కు ఇండెంట్ పంపుతున్నట్లు ఎమ్మెల్సీ ఎమ్మెల్యే కు అధికారులు విన్నవించారు. రైతులు సాగు చేస్తున్న పంటలు ఎండిపోతున్నాయని అధైర్య పడవద్దని సకాలంలో సాగునీరు విడుదలవుతుందని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే పేర్కొన్నారు. దీంతో సకాలంలో సాగునీటిని విడుదల చేయించిన ఎమ్మెల్సీ,ఎమ్మెల్యేకు అలంపూర్ నియోజకవర్గ రైతులు కృతజ్ఞతలు తెలిపారు.



తుమ్మిళ్ల పోతల పథకం ద్వారా సాగునీటిని విడుదల దృశ్యం

# ఈ.వి.యం గోదామును పరిశీలించిన జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్ జనవరి 8 ప్రభాతవార్త :** ఈ.వి.యం గోదాముకు పూర్తి భద్రత కల్పించాలని జిల్లా కలెక్టరు, జిల్లా ఎన్నికల అధికారి ఆదర్శ్ సురభి ఆదేశించారు. ఈ.వి.యం గోదాం భద్రత విషయంలో మాసవారి తనిఖీల్లో భాగంగా బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం పక్కన ఉన్న ఈ.వి.యం గోదామును కలెక్టర్ పరిశీలించారు. రిజిస్టరు, గోదాం సీలు పోలీస్ భద్రత అంశాలను పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సుబ్రమణ్యం, స్థానిక తహశీల్దార్ రమేష్ రెడ్డి ఇతర సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.



ఈ.వి.యం గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్

## 33 జిల్లాలు..

# 861 ప్రదర్శనలు



- చిట్టి బుర్రలు.. పెద్ద ఆలోచనలు..
- ఆకట్టుకున్న ప్రయోగాలు
- వ్యవసాయం, సాంకేతికత, సోలార్ పవర్
- జనరేషన్, పంట కాపాడుకునే విధానాలపై ప్రదర్శనలు
- ఎస్వికేయం పాఠశాలలో విజయవంతంగా కొనసాగుతున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

**మహబూబ్‌నగర్ బ్యూరో /జడ్చర్ల, జనవరి 8 ప్రభాతవార్త:** పోలేపల్లి సెజ్ లోని ఎస్‌వికేఎన్ పాఠశాల వేదికగా కొనసాగుతున్న రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లావ్యాప్తంగా వేలాదిమంది విద్యార్థులు తరలివచ్చి ప్రదర్శనలు తిలకించారు. రాష్ట్రస్థాయి ప్రదర్శనను తిలకించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలకు చెందిన విద్యార్థులు వేలాదిగా తరలి రావడంతో ఎస్వీకేఎం క్యాంపస్ అంతా కిక్కిరిసిపోయింది. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, డీఈవో ప్రవీణ్ కుమార్, జడ్చర్ల ఎంఈఓ మంజులాదేవి ఎస్వికేయం డైరెక్టర్లు యాజమాన్యం పర్యవేక్షణలో రాష్ట్రస్థాయి ప్రదర్శన విజయవంతంగా కొనసాగింది. నేటితో ప్రదర్శన ముగియను ఉండడంతో వేలాదిమంది విద్యార్థులు తరలి రానున్నారు. వ్యవసాయానికి సంబంధించి, వర్షం సమయంలో పంటను కాపాడుకునే విధానాలు, కెనాల్ వాటర్ నుంచి విద్యుత్ ఉత్పత్తి, జంతువుల నుంచి పంటను కాపాడే విధానం, కుక్కల భారీ నుంచి చిన్నారులం కాపాడే విధానం, ట్రైన్ పట్టాలు తప్పినప్పుడు తీసుకునే జాగ్రత్తలు లాంటి వందలాది సమాజ హితంతో కూడిన సామాన్య మానవులకు ఉపయోగపడే విధంగా ప్రయోగాలు తయారుచేసి ప్రదర్శనలో ఉంచారు.

**కెనాల్ వాటర్‌తో విద్యుత్ ఉత్పత్తి**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం శారద హై స్కూల్ పాఠశాలకు చెందిన పదవ తరగతి చదువుతున్న త్రిపుర "కెనాల్ వాటర్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి " అనే అంశంపై తాను ప్రాజెక్ట్ తయారుచేసి ప్రదర్శించారు. కాల్వ ద్వారా నీళ్లు వెళుతున్నప్పుడు నీళ్లు పైనుంచి కిందకి దార పడేలా ఒక సంపు లాంటిది నిర్మించి దానిని అనుసరించి ఒక టర్బైన్ మోటార్ సాయంతో చక్రం తిరిగేలా నీటిలో అమర్చారు. చక్రం పెరిగినప్పుడు జల విద్యుత్ శక్తి ఉత్పత్తి అవుతుంది.




**360 డిగ్రీ కెమెరా** చాలా సందర్భాల్లో వాహనాలు కింద మూగజీవాలు పడుకొని ఉన్న సమయంలో డ్రైవర్లు గమనించకుండా అజాగ్రత్తగా అలాగే వెళ్లడం వల్ల ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. అయితే చిన్నపిల్లలు కూడా పెద్ద వాహనాల కింద ఆడుకుంటున్న సమయంలో ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. వాటిని నివారించేందుకు వాహనానికి 360 డిగ్రీ కెమెరా బిగించడం వల్ల వాహనం నలుదిక్కుల ఏమేం ఉన్నాయి అనేది చూసుకోవచ్చు.



**గో ఆధారిత వ్యవసాయం** నాగర్‌కర్నూల్ జిల్లా పదరా మండల కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయానికి చెందిన పదవ తరగతి చదువుతున్న లావణ్య మెంటర్ మహేశ్వరి సహాయంతో గో ఆధారిత వ్యవసాయానికి సంబంధించిన ప్రదర్శనను ఉంచారు. ప్రస్తుత మారుతున్న పరిశుద్ధ దృష్ట్యా ఆహారపు అలవాట్లతోనే అనేక రకాల వ్యాధులు పెస్టిసైడ్స్ ఫుడ్డు తీసుకోవడం వల్లే రోగాలు వస్తున్న నేపథ్యంలో సహజ సిద్ధంగా గో ఆధారిత వ్యవసాయంతో పండించిన పంటలు ధాన్యాలనే వినియోగించాలని సూచిస్తూ ప్రదర్శించారు.



**అప్డేట్ టాయిలెట్ క్లీనింగ్ క్లీనింగ్ సిస్టం** జిల్లా పరిషత్ హై స్కూల్ అన్నారం గ్రామం మంచిర్యాల జిల్లాకు చెందిన శ్రవణ్ కుమార్ అప్డేట్ టాయిలెట్ క్లీనిగ్ సిస్టమ్ పై తన ప్రదర్శనను నిర్వహించారు. సినిమా హాల్లో, పాఠశాలలు, ప్రతి ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో టాయిలెట్స్ ను యూస్ చేసిన తర్వాత ప్రతి ఒక్కరూ క్లచ్ చేయడం మర్చిపోతారు. ఇలాంటి సందర్భంలో టాయిలెట్ చేసిన వెంటనే ఆటోమేటిక్ గా డోర్ ఓపెన్ చేయగానే వాటర్ ఫ్రెష్ అయ్యేలా అతి తక్కువ ఖర్చుతో కూడుకున్న ఒక నమూనాను తయారు చేశారు.



**చిల్డ్రన్ ప్రొటెక్టర్ ఫ్రొం డాగ్స్ బైట్** మేడ్చల్ జిల్లా కు చెందిన నవ జ్యోతి హై స్కూల్ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న యోగేష్ "చిన్నారులను కుక్కల నుంచి కాపాడడం " అనే అంశంపై తయారు చేసిన ప్రయోగాన్ని ప్రదర్శించాడు. చేతి వాచీ సైజులో జిపిఎస్తో పాటు అల్లారంతో కూడిన ఒక పరికరాన్ని తయారు చేశాడు. కుక్కలు చిన్నారులను చుట్టుముట్టి కరిచేందుకు ప్రయత్నించినప్పుడు ఆ పరికరానికి అమర్చిన స్విచ్చు ఆన్ చేయాల్సి ఉంటుంది. అప్పుడు పటాకులు కాల్చిన శబ్దం వస్తుంది. కుక్కలు సహజంగా పటాకులు కాల్చిన శబ్దానికి భయపడి దూరంగా వెళ్తాయి. దీంతోపాటు చిన్నారులు ఎక్కడ ఉన్నది అనే విషయాన్ని తమ ఫోన్ ద్వారా ఇంట్లో ఉన్నవారు ట్రాక్ చేయొచ్చు.



# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

**స్వయం సహాయక సంఘాల ద్వారా 1000 మెగావాట్ల ఉత్పత్తి త్వరలో టెండర్లు ఖరారు చేస్తాం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**వనపర్తి టౌన్, నారాయణపేట టౌన్,జనవరి 8 ప్రభాతవార్త :** రాష్ట్రంలో నిరుపేద మహిళలను లక్షాధికారులను చేయడం లక్ష్యంగా స్వయం సహాయక బృందాల ద్వారా సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు ముమ్మరం చేయాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. బుధవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో స్వయం సహాయక బృందాల ద్వారా సోలార్ ప్లాంట్ల ఏర్పాటు అంశంపై సహచర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసారి అనసూయ, కొండా సురేఖ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వనపర్తి జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంచిత్ గంగ్వార్ హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలను లక్షాధికారులను చేయడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక బృందాల ద్వారా 1000 మెగావాట్లు విద్యుదుత్పత్తి లక్ష్యంగా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సంకల్పించిందన్నారు. తద్వారా మహిళలు ఆర్థికంగా అభ్యున్నతి చెందడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్ళి, విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్లను – మిగతా4లో..



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం, మంత్రులు

## ఎమ్మెల్యే కాన్వాయ్‌ని అడ్డుపడ్డ బిజెపి నాయకులు



ఎమ్మెల్యే వాహనానికి అడ్డుపడుతున్న బిజెపి కార్యకర్తలు

**బిజినేపల్లి, జనవరి 8 ప్రభాతవార్త:**తెలంగాణ బీజేపీ రాష్ట్రకార్యాలయంపై కాంగ్రెస్ యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేయడం అత్యంత హేయమైన చర్య అని బిజెపి నాయకులు అన్నారు. బుధవారం బిజినేపల్లిలో పర్యటన ముగించుకుని వెళ్తున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి కాన్వాయ్‌ని బిజెపి నాయకులు అడ్డుపడ్డారు. వెంటనే పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు బిజెపి నాయకులు బాలస్వామి,కడారి కృష్ణలక్ష్మినారాయణ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆరోపణలు చేసినప్పుడు – మిగతా2లో..

# ఉత్తమ దవాఖానగా మార్చేందుకు చర్యలు

**కలెక్టర్ విజయేంద్ర బోయి**

**హైదరాబాద్‌కు తగ్గ రీతిలో సేవలు**

**ఎమ్మెల్యే యెన్నం ది బెస్ట్ గా తయారు చేద్దాం**

**సోలార్ లైట్స్ అంబులెన్స్ ఇచ్చే బాధ్యత నాది**

**ఎంపీ డీకే అరుణ మహబూబ్‌నగర్ జిల్లా జనరల్ దవాఖాన అభివృద్ధి కమిటీ సమావేశం**

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 8 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా ఉత్తమ ఆసుపత్రిగా రూపొందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధిపై సమీక్షించారు. ఆసుపత్రిలో డ్రైనేజీ,ఎలక్ట్రిక్ పనులు, ఆసుపత్రిలో స్పెషల్ రూంలు అద్దెకు ,రోగులకు సేవలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యులు డి.కె.అరుణ, శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస రెడ్డి సభ్యులు పాల్గొన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్ పర్సన్ జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చర్యలు,ఆసుపత్రి అభివృద్ధి కి తీసుకోవలసిన చర్యలపై సమీక్షించారు. ఆసుపత్రి లో డ్రైనేజీ,ఎలక్ట్రిక్ పనులకు టి.ఎస్. ఎం. ఐ.డి.సి ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఆసుపత్రి లో 10 వేల లీటర్ల సామర్థం కల శిధిలావస్థకు చేరిన పాత ఓవర్ హెడ్ ట్యాంక్ స్థానంలో కొత్త ఓవర్ హెడ్ ట్యాంక్ మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు ద్వారా నిర్మాణం చేయాలని సూచించారు. ఆసుపత్రి ముందు పెద్దగా పెరిగిన చెట్లు వేర్లు భవనం లోపలికి వెళ్ళి భవనం కు ప్రమాదం ఉన్నందున చెట్లను తొలగించేందుకు అనుమతికి అటవీ శాఖ అధికారులకు లేఖ రాయాలని సూచించారు. ఆసుపత్రి లో స్పెషల్ రూంలు రోగులకు అద్దెకు ఇచ్చేందుకు కమిటీ లో నిర్ణయం తీసుకున్నారు. 7 సింగిల్ రూం లు,2 షేరింగ్ రూం లు రోగులకు సింగిల్ రూం రోజుకు 1000 రూ. ల చొప్పున,షేరింగ్ స్పెషల్ రూం లు రోజుకు 500 రూ. ల చొప్పున రెంట్ నిర్ణయించారు. ఆసుపత్రి లో జిల్లాలో ప్రైవేట్ ఆసుపత్రులలో పని చేస్తున్న ఆరుగురు కార్డియాలజీ డాక్టర్ లు ఉచితంగా రోగులకు సేవలు సంక్రాంతి నుండి రెండు గంటలు వారానికి ఒకరి చొప్పున అందుబాటులో ఉంటారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షులు డా.రాం మోహన్ సమావేశంలో తెలిపారు. కొత్తగా నిర్మిస్తున్న బోధన ఆసుపత్రి భవనం త్వరగా నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు ఆసుపత్రి అభివృద్ధి సమావేశం లో పాల్గొన్న మహబూబ్‌నగర్ పార్లమెంటు సభ్యులు డి.కె.అరుణ మాట్లాడుతూ బోధనా ఆసుపత్రి నూతన భవనం త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు ప్రాంతాల నుండి గ్రామీణ ప్రాంతాల నుండి ఎక్కువ సంఖ్యలో రోగులు వస్తారని,ప్రతి పేద వానికి వైద్యం అందించాలని అన్నారు. జిల్లా జనరల్ ఆసుపత్రిని వచ్చే 4 సంవత్సరాలలో ఉత్తమ ఆసుపత్రిగా రూపొందించేందుకు కార్యాచరణ రూపొందించాలని అన్నారు. కేంద్ర,రాష్ట్రాల నిధులు వినియోగించుకోవాలని అన్నారు. స్పెషల్ రూంలు రోగులకు అద్దెకు ఇచ్చేందుకు మోడల్ గా చేశారు. సోలార్ లైటింగ్ కు,అంబులెన్స్‌కు నిధులు అందించాలన్నారు. పరిశ్రమలతో సమావేశం ఏర్పాటు చేసి సి.ఎస్.అర్ నిధులతో పాఠశాలలు, ఆసుపత్రి, త్రాగు నీరు నిధులు మంజూరు చేయాలని కోరాలని సూచించారు. ప్రతి ఒకరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్షయంగా సిబ్బంది పని చేయాలని, వచ్చే నాలుగేళ్లలో ఈ అస్పత్రిని ది బెస్ట్ గా తీర్చిదిద్దాలని సూచించారు. మహబూబ్ నగర్ ఆస్పత్రి అభివృద్ధి బాధ్యత మనందరిదని, తన కూతురు కూడా ప్రభుత్వ అస్పత్రిలోనే పుట్టిందన్నారు. ఆస్పత్రిని మరింత అబివృద్ధి చేసేందుకు ఎంపీ, ఎమ్మెల్యేల ఫండ్స్ సరిపోవని, అందుకే ఇక్కడ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు తీసుకొచ్చే బాధ్యత నాది, ఎమ్మెల్యేదన్నారు. అస్పత్రికి అవసరమైన సొలార్ లైట్స్, ఒక ఆంబులెన్స్ ఇచ్చే బాధ్యత తనదన్నారు. మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మహబూబ్ నగర్ ఆసుపత్రిలో సేవలు హైదరాబాద్‌కు తగ్గ రీతిలో అందించే విధంగా భవిష్యత్తులో రాష్ట్రంలోనే ఉత్తమ ఆసుపత్రిగా మహ బూబ్‌నగర్ ఆసుపత్రి అభివృద్ధి చేయుటకు తన వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అత్యవసర పనులు నిమిత్తం 10 లక్షల రూపాయల నిధులు అందజేస్తానని ఆయన హామీ ఇచ్చారు. తొలుత ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎంపి డికె అరుణ, శాసన సభ్యులు యెన్నం శ్రీనివాసరెడ్డి లు కార్డియాలజీ హబ్ ను, మాతా శిశు విభాగం (ఎంసిహెచ్) వార్డు ను, ఇఎన్టీ ఆపరేషన్ థియేటర్‌ను, ఓటి కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హాస్పిటల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్, డా. సామ్యూల్, లయన్ నటరాజ్, డా.జె.రాంమోహన్, డిఎంహెచ్‌ఓ డా. కృష్ణ, సూపరిండెంట్ డా. సంపత్ కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



దవాఖానాలో వసతులు పరిశీలిస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం, కలెక్టర్ విజయేంద్ర బోయి

# ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు షూ పంపిణీ


విద్యార్థులకు షూ పంపిణీ చేస్తున్న శశికళరెడ్డి

**బాలానగర్, జనవరి 8 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి తన సొంత నిధులతో నియోజకవర్గం లోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులందరికి ఉచిత షూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా బాలానగర్ మండలం పెద్దబాయి తండా గ్రామ పంచాయతీలోని ప్రభుత్వా పాఠశాలలో విద్యార్థులందరికీ ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి మాతృమూర్తి శశికళ రెడ్డి షూ పంపిణీ చేశారు. శశికళ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని పుట్టిన ఊరికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసు కురావాలన్నారు. పాఠశాలలోని మౌలిక వసతులపై ఆరా తీసి,పాఠశాలలో కనీస సౌకర్యాలు త్రాగునీరు, మరుగుదొడ్ల లేనందున ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తానన్నారు. అనంతరం శశికళ రెడ్డి వార్త తెలుగు జాతీయ దినపత్రిక యొక్క ఆంగ్ల నూతనసంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు శంకర్ నాయక్, జిల్లా యువజన ఉపాధ్యక్షుడు మోహన్ నాయక్, మైనార్టీ సెల్ అధ్యక్షులు రఫీక్, యువజన మండల అధ్యక్షులు శ్రీనాథ్ నాయక్, రవినాయక్, వీరేందర్ నాయక్, వెంకట్‌నాయక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి నేతను కఠినంగా శిక్షించాలి..


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న దృశ్యం

**మక్తల్,జనవరి 8 ప్రభాతవార్త:** కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, వయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి మాజీ ఎంపీ రమేష్ బిదురిపై తక్షణమే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు కే. వేణుగౌడ్ డిమాండ్ చేశారు. ప్రియాంక గాంధీపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారంమక్తల్‌పట్టణంలో యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద 167వ జాతీయరహదారిపై రమేష్ బిదూరి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నియోజకవర్గ అధ్యక్షుడు ఆఫ్రోజ్, యువజన కాంగ్రెస్ మక్తల్ మండలఅధ్యక్షుడు వాకిటిభాస్కర్,ఆనంద్, మహేష్ కుమార్ రెడ్డి, సర్ఫరాజ్, అశోక్ గౌడ్,కృష్ణవంశీ,విరేష్ గౌడ్,రమేష్‌యాదవ్,రవి రెడ్డి, శ్రీరామ్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు చెరువులో పడి యువకుడు మృతి

**మక్తల్, జనవరి 08 ప్రభాతవార్త:** ఉర్సు ఉత్సవాల కోసం బంధువుల ఇంటికి వచ్చిన యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి శవమై తేలిన ఘటన మక్తల్ మండలంలోని దాసర్ దొడ్డిలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. మక్తల్ ఎస్సై వై. భాగ్యలక్ష్మి రెడ్డి కథనం ప్రకారం ఊట్కూరు మండలంలోని బిజ్వార్ గ్రామానికి చెందిన పొర్ల నరసింహ (33) మంగళవారం మక్తల్ మండలంలోని దాసర్ దొడ్డిలో జరిగిన ఉర్సు ఉత్సవాల్లో పాల్గొనేందుకు బంధువుల ఇంటికి వచ్చాడు. ఉదయం నుంచి భార్యా పిల్లలు, బంధువుల మధ్య ఉత్సాహంగా గడిపిన నరసింహ రాత్రి 8 గంటల ప్రాంతంలో సమీపంలోని చెరువు వద్దకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లాడు. ఈ క్రమంలోనే ప్రమాదవశాత్తు చెరువు నీటిలో మునిగి మృతి చెందాడు. అయితే రాత్రి ఎంత సేపటికి నరసింహ ఇంటికి రాకపోవడంతో అనుమానంతో పలు ప్రాంతాల్లో వెతకగా, బుధవారం ఉదయం చెరువు వద్ద శవమై తేలాడు. ఈ ఘటనపై మృతుడి భార్య పొర్ల పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. మృతునికి పదేళ్ల లోపు ఒక కుమారుడు ఉన్నారు.

# వరి నారు ఎదుగుదలపై యాజమాన్య పద్ధతులు

**ఉప్పునుంతల, జనవరి 8 ప్రభాతవార్త :** వరి నారు పై చలి ప్రభావం ఎవరన్నా ఉన్నందున వాటి కొనలు ఎర్రబారి ఎదుగుదల లో పిస్తోందని తగు యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి రమేష్ తెలిపారు. రాత్రి వేళల్లో కొత్త నీరు పె ట్టి ఉదయాన్నే తీసి వేయాలని, నారు మడిని రాత్రి పూట టార్పాలిన్ లేదా యూరియా సంచులను కర్రలతో రాత్రి పూట కప్పి ఉదయాన్నే తీసివేయాలని సూచించారు. మంచి ఎదుగుదలకు 10 వయస్సు ఒక గుంట నారుకు కెజీ యూరియా, 2 గ్రాములు కార్బటిజం మందులను లీటర్ నీటిలో కలిపి పిచ్చుక చేయాలని సూచించారు. జింకు లోప నివారణకు 2 గ్రాముల జింక్సే4 లీడర్ నిధులు కలిపి వారంలో రెండుసార్లు చేయాలని, అదేవిధంగా కాండం కుళ్ళు తెగులకు ప్రాఫి కోనజోల్ ఎమ్మెల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని రైతులకు అవగాహన కల్పించారు. కాండం తొలుచు, ఇతర పురుగుల నివారణకు నారు పీకే వారం రోజుల ముందు కార్బోపారన్ 3 జి 1 కెజీ 5 సెంట్ల చల్లుకోవాలని ఎఓ రమేష్ రైతులకు అవగాహన కల్పించారు.

# సైబర్ నేరాలపై అవగాహన : నవాబుపేట ఎస్సై

### 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచన


సైబర్ నేరాలపై అవగాహన కలిగిస్తున్న దృశ్యం

**నవాబుపేట, జనవరి 8 ప్రభాతవార్త :** సైబర్ నేరాలపై నవాబుపేట పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై విక్రం మాట్లాడుతూ యువత ఇంటర్నెట్ పరిమితికి మించి వాడకూడదని, సైబర్ నేరగాళ్లు రోజుకో రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులను కాజేస్తున్నారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు మీకు ఫోన్ చేసి మీ ఏటీఎం,పిన్ నెంబర్, సీవీ ఏ బ్యాంకు ఖాతా తదితర వివరాలు కోరితే ఇవ్వరాదన్నారు. ఎవరైనా మీకు లాటరీ తగిలింది కొంత డబ్బు సూచించిన బ్యాంకు ఖాతాలో జమ చేయాలని ఫోన్ కాల్ వచ్చినా, ఏ విధంగా అయినా మీరు మీ బ్యాంకు ఖాతా నుంచి డబ్బును కోల్పోతే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని సూచించారు. అలాగే సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబరుకు డయల్ చేయాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా అందరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# ఫతేపూర్ మైసమ్మ ఆలయ హుండీ లెక్కింపు..

### తగ్గిన మైసమ్మ జాతర హుండీ ఆదాయం

**నవాబుపేట,జనవరి 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయం హుండీని బుధవారం లెక్కించారు. ఆలయ కమిటీ చైర్మన్ జగన్మోహన్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తుల దేవాదాయ పరిశీలకుల ఆధ్వర్యంలో లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. ఆలయ పరిశీలకులు జగన్మోహన్‌రెడ్డి, రికార్డు అసిస్టెంట్ గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం, 92,800 నగదు రూపంలో, 33 తులాల వెండి, 2.6 మాసాల బంగారం జాతర నిర్వహించిన రోజునుండి నేటి వరకు వచ్చినట్లు వెల్లడించారు. అయితే ఈ ఏడాది జాతర ఆదాయం తగ్గిందని భక్తులు, గ్రామస్తులు అనుకుంటున్నారు. దీనికి కారణం పర్వతాపూర్ మహిమాన్విత మైసమ్మ జాతర విశిష్టతను జిల్లాల గ్రామాల ప్రజల్లోకి తీసుకుపోవడంలో గోడపత్రికలు, పోస్టర్లు పెట్టి ఆటోలలో మైకులు పెట్టి ప్రచారం చేయకపోవడంతో ఆలయ ఆదాయం తగ్గిందని భక్తులు, ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే గ్రామాల్లో అయ్యప్ప స్వాముల పూజలు ఇరుముడులు స్వాములను సాగనంపడం కార్యక్రమాలు ఉన్నందున కాస్త భక్తుల సంఖ్య తగ్గిందని కొంతమంది అభిప్రాయం. హుండీ లెక్కింపులో ఆలయపాలకమండలి చైర్మన్ జగన్మోహన్‌రెడ్డితో పాటు రికార్డ్ అసిస్టెంట్ గోపాల్,మల్లేష్ మాధవులు, కాకర్లపాడు అధ్యక్షులు బాలరాజు,రమేష్, కాంగ్రెస్ నాయకులు మైనుద్దీన్, ఆలయ అర్చకులు, గ్రామ ప్రజాప్రతినిధులు బక్క బాలయ్య,కృష్ణయ్య,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి ఖోఖోకి మద్దూరు విద్యార్థి ఎంపిక

**మద్దూర్,జనవరి 8 ప్రభాతవార్త:** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎస్‌జిఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర స్థాయిలో జరిగిన అండర్ 14 బాలుర ఖో ఖో విభాగంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర మద్దూర్ కి చెందిన రాజశేఖర్ రెడ్డి 9వ తరగతి విద్యార్థి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు నుండి రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ చెన్నారం వెంకటప్ప తెలిపారు. విద్యార్థి ఎంపిక పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు సవిత మాట్లాడుతూ క్రమశిక్షణతో మెలిగి జాతీయ స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం బాలాజీ,రఘు, వసంత కుమార్, వనజ, ప్రసన్నలక్ష్మి, విజయలక్ష్మి, శారద, సూర్య ప్రకాష్, రవి, సుధాకర్, నాగేందర్, యశ్వంత్, భీమయ్య, బంద్యయ్య, స్వప్న, రాజశేఖర్, ఆంజనేయులు, సునీత, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# మాదిగ జేపసీ పేట ఇన్చార్జిగా పి.రంగస్వామి



**కోయిల్‌కొండ, జనవరి 8 ప్రభాతవార్త:** మాదిగ జేపసీ నారాయణపేట ఇంఛార్జిగా మండల కేంద్రమైన కోయిలకొండకు చెందిన పానుగంటి రంగస్వామిని ఆ సంఘం రాష్ట్ర జేపసీ కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక చేసి నియామకపు పత్రాన్ని అందజేశారు. టీఎంజేపసీ రాష్ట్ర నాయకుడు దండు దేవన్న నియామకపు పత్రాన్ని రంగస్వామికి అందజేశారు. నూతనంగా ఎంపికైన జేపసీ నారాయణపేట ఇన్చార్జి పి రంగస్వామి మాట్లాడుతూ ఏబిసిడి వర్గీకరణ కోసం సాగుతున్న ఉద్యమం బలోపేతం చేసేందుకు శ్రమించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాదిగ జేపసీ నేతలు రాకేష్, నగేష్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ బడ్జెట్ ప్రతిపాదనలు పక్కాగా రూపొందించాలి : జిల్లా కలెక్టర్


బడ్జెట్ ప్రతిపాదనల తయారిపై సూచనలు చేస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్ జనవరి 8 ప్రభాతవార్త :** 2025–26 సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ బడ్జెట్ పక్కాగా రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ తో కలిసి జిల్లాలోని అన్ని మున్సిపల్ అధికారులు, అకౌంట్స్ ఆఫీసర్లతో బడ్జెట్ ప్రతిపాదనల తయారిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఆర్థిక సంవత్సరంలో రూపొందించిన బడ్జెట్ ప్రతిపాదనలు, వసూలు చేసిన ట్యాక్సులు, ఖర్చు చేసిన నిధులపై ఒక్కో మున్సిపాలిటీ వారీగా సమీక్ష నిర్వహించారు. మున్సిపాలిటీల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, పట్టణ అభివృద్ధి, మౌలిక వసతులు, పారిశుధ్య కార్యక్రమాలు బాగా చేసేందుకు ప్రాపర్టీ ట్యాక్స్, వాటర్ ట్యాక్స్, ట్రేడ్ లైసెన్స్ ట్యాక్స్ మొదలగునవి పకడ్బందీగా వసూలు చేయాలని ఆదేశించారు. కొత్తగా ఇళ్ళు నిర్మించుకున్న గృహాలను ఎప్పటికప్పుడు అసెస్మెంట్ చేసి ట్యాక్స్ వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ప్రాపర్టీ ట్యాక్స్ పెండింగ్ అధికంగా ఉన్నవారికి నోటీస్ జారీ చేసి పెనాల్టీతో పాటు ట్యాక్స్ వసూలు చేయాలని ఆదేశించారు. బిల్డింగ్ రెనోవేషన్, అదనపు ఫ్లోర్ కట్టుకున్న ఇళ్లను గుర్తించి ఎసెస్మెంట్ రివైజ్ చేయాలని సూచించారు. కొత్త బడ్జెట్ లో పారిశుద్యానికి వాహనాలు కొనుగోలు చేయటం, విద్యుత్ బిల్లులు చెల్లించడం వంటివి చేయాలని సూచించారు. మొత్తం సంపాదనలో 10 శాతం గ్రీన్ బడ్జెట్ కు కేటాయించి మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని ఆదేశించారు. మొక్కలు పెంచటంలో నిధులు సరిగ్గా ఖర్చు చేయడం లేదని, ఈసారి ఖచ్చితంగా ఖర్చు చేసి జిల్లాను హరితవనంగా మార్చాలని ఆదేశించారు. బడ్జెట్ ప్రతిపాదనలు సి.డి.యం. ఏ ఇచ్చిన ప్రోఫార్మాలోనే రూపొందించాలని ఆదేశించారు. కొత్తగా మున్సిపాలిటీల్లో కలిసిన గ్రామాల్లో నిబంధనల ప్రకారం నిధులు ఖర్చు చేసి మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. వీధి కుక్కల నియంత్రణకు శస్త్ర చికిత్సలు చేయించే విధంగా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని నిధులు కేటాయించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్ అన్ని మున్సిపాలిటీల మున్సిపల్ కమిషనర్లు, డి. ఈ లు, అకౌంట్స్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సిఎం పర్యటన నేపథ్యంలో పకడ్బందీగా చర్యలు

### జిల్లాలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంఖుస్థాపనలు : జిల్లా కలెక్టర్


డిప్యూటీ సీఎం పర్యటన ఏర్పాట్లను పర్యావేక్షిస్తున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి టౌన్ జనవరి 8 ప్రభాతవార్త :** జనవరి 9న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వనపర్తి జిల్లా పర్యటన విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా ఉదయం 9.30 గంటలకు రేవల్లి మండలం తల్పనూర్ గ్రామంలో 33/11 కే.వి సబ్ స్టేషన్ ను ప్రారంభిస్తారు. అనంతరం గోపాలపేట మండలంలో ఎదుట్ల గ్రామంలో 33/11 కే.వి సబ్ స్టేషన్ ను ప్రారంభోత్సవం చేస్తారు. వనపర్తి పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం పక్కన ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయం ఆవరణలో వనపర్తి మండలానికి చెందిన ఖాసింనగర్, చిమన్ గుంటపల్లి, మెట్టుపల్లి, నాగవరం గ్రామాలకు చెందిన( 4 ) 33/11 కే.వి., పెద్దమందడి మండలానికి చెందిన పామిరెడ్డి పల్లి గ్రామ 33/11 కే.వి., గోపాల్ పేట మండలం, చెన్నూరు గ్రామానికి సంబంధించిన 33/11 కే.వి., శ్రీరంగాపూర్ మండలం నాగరాల గ్రామానికి చెందిన 33/11 కే.వి మొత్తం 7 విద్యుత్ సబ్ స్టేషన్లకు శంఖుస్థాపన చేస్తారని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనను పురస్కరించుకొని బుధవారం కలెక్టర్ వనపర్తి విద్యుత్ శాఖ కార్యాలయం, గోపాల్పేట మండలం ఎదుట్ల సబ్ స్టేషన్ ను సందర్శించి ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆర్డీఓ సుబ్రమణ్యం, విద్యుత్ శాఖ డి.ఈ శ్రీనివాస్, తహశీల్దార్లు రమేష్ రెడ్డి, గోపాల్ పేట తహశీల్దార్ తిలక్ కుమార్ రెడ్డి, గోపాల్ పేట ఎస్.ఐ. ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రెడ్డి సోదరులు సమాజంలో ఆదర్శంగా నిలవాలి


ఆటల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు ప్రదానం

**ఉప్పునుంతల,జనవరి8 ప్రభాతవార్త:** రెడ్డి సోదరులు సమాజంలో ఆదర్శంగా నిలవాలని, సమిష్టి కృషితో రెడ్ల అభివృద్ధికి చేస్తానని ఉమ్మడి పాలమూరు జిల్లా రెడ్డి సేవా సమితి అధ్యక్షులు తుం ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం రెడ్డి భవనంలో ఉప్పునుంతల మండల రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు కట్ట చిన్న జనార్దన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన రెడ్డి సేవా సమితి క్యాలెండర్ 2025 ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు తూం ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ రెడ్డి సోదరులు ఐక్యంగా ఉండడంతో పాటు సామాజిక సేవలో పాలుపంచుకుంటూ ఆదర్శంగా నిలవాలని అన్నారు. మండల కేంద్రంలో విశాలమైన రెడ్డి భవనం నిర్మించుకోవడం రెడ్డిల ఐక్యతకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. రెడ్డి సామాజిక వర్గంలోని పేద విద్యార్థులకు చదువు కోసం తోడ్పాటు అందించడంతోపాటు ఆపదలో ఉన్న పేద రెడ్డి సోదరులకు సహాయం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా రెడ్డి సేవా సమితి కార్యదర్శి రాజేందర్ రెడ్డి, తాలూకా రెడ్డి సేవ సమితి అధ్యక్షులు కసిరెడ్డి రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి జైపాల్ రెడ్డి,మహిళా కమిటీ అధ్యక్షురాలు జటప్రోలు కవిత ,రాగి సుమతి, మండల రెడ్డి సేవా సమితి అధ్యక్షులు కట్ట జనార్దన్ రెడ్డి,నాయకులు అనంతరెడ్డి, డాక్టర్ కొత్త చిన్న జంగి రెడ్డి, మాజీ జెడ్పిటిసి అనంత ప్రతాపరెడ్డి, రామకృష్ణారెడ్డి, గోపి రెడ్డి రఘుపతి రెడ్డి ,నరసింహారెడ్డి మల్లారెడ్డి ,రమేష్ రెడ్డి, కట్ట సరిత, కొత్త యశోద,కొత్త అచ్చుతారెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు. బహుమతులు ప్రదానం.. మండల కేంద్రమైన ఉప్పునుంతల రెడ్డి భవనంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అదేవిధంగా మంగళవారం రాత్రి కబడ్డీ , ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉత్కంఠ భరితంగా ముగిసిన పూలే అంబేద్కర్ వాలీబాల్ టోర్నమెంట్

### ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాలలో నిలిచిన హైదరాబాద్, ఖమ్మం, బెంగళూరు జట్లు


క్రీడాకారులతో నాయకులు

**నవాబుపేట,జనవరి 8 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొల్లూరు గ్రామంలో గత రెండు రోజులు నుండి పూలే అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్ లో ఓపెన్ టు ఆల్ విభాగంలో కర్ణాటక,ఖమ్మం జట్ల మధ్యలో హోరా హోరీగా రాత్రి ఒంటిగంట వరకు జరిగిందని ఆర్గనైజర్స్ విస్లావత్ చందర్ నాయక్, మహమ్మద్ ఖాజామైనోద్దీన్‌లు తెలిపారు. రూరల్ విభాగంలో చిన్న రేవల్లి షాద్‌నగర్ జట్ల మధ్య పోటీ జరిగిందని వారు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు విశారదన్ మహారాజ్ పాల్గొని ప్రసంగించారు. విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ కొల్లూరు గ్రామం మారుమూల గ్రామం కాదని పూలే అంబేద్కర్ పేరున వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారంటే ఈ గ్రామంలో గొప్ప మహానుభావులైన పూలే అంబేద్కర్ సిద్ధాంతంపై, వారిని స్ఫూర్తిగా తీసుకొని పనిచేసే నాయకులు ఉన్నారని అన్నారు. టోర్నీలో గెలిచిన జట్లకు విశారదన్ మహారాజ్ మెమొంటోలు ప్రైజ్ మనీ అందజేశారు. రెండు రోజులపాటు నిర్వహించిన ఓపెన్ టు ఆల్ విభాగంలో మొదటి బహుమతి కర్ణాటక జట్టుకు రూ.30 వేల నగదుతో పాటు ట్రోఫీని, రెండో బహుమతి ఖమ్మం జట్టుకు రూ15వేలతో పాటు ట్రోఫీని, మూడవ బహుమతి హైదరాబాద్ జట్టుకు రూ. 10వేలతో పాటు ట్రోఫీని, అందజేసినట్లు తెలిపారు. రూరల్ విభాగంలో గెలుపొందిన షాద్‌నగర్ జట్టుకు పదివేల రూపాయలతో పాటు ట్రోఫీని, రెండవ బహుమతి చిన్న రేవల్లి జట్టుకు రూ.5వేలతో పాటు ట్రోఫీని అందించడం జరిగిందని నిర్వాహకులు విస్లావత్ చందర్ నాయక్,మహమ్మద్ ఖాజామైనోద్దీన్ తెలిపారు. టోర్నీ నిర్వహణకు సహకరించిన గ్రామ పెద్దలకు, గ్రామ ఉద్యోగస్తులకు,యువకులకు, రెండు రోజులపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన శ్రీ లక్ష్మి నివాస ఇండస్ట్రీస్‌కు ఎలాంటి ఆవంచనీయ సంఘటనలు జరగకుండా సహకరించిన గ్రామ యువతకు పూలే అంబేద్కర్ అసోసియేషన్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# స్వామినాథన్ సిపారసులు అమలు చేయాలంటూ ధర్నా



తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న అఖిల భారత రైతు సంఘం నాయకులు

**ఆత్మకూరు జనవరి 8 ప్రభాతవార్త :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు కల్పించే విధంగా స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫారసులు అమలు చేయాలంటూ అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం రోజు ఆత్మకూరులోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కే రాజన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత ఎన్నికలకు ముందు మూడు కార్పొరేట్ వ్యవసాయ చట్టాలు రద్దు చేస్తామంటూ రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులను మట్టేట ముంచే విధంగా నిర్ణయాలు తీసుకోవడం సిగ్గుచేటైన విషయంగా ఆయన పేర్కొన్నారు. గత 13 నెలలుగా ఉత్తరప్రదేశ్ పంజాబ్ బీహార్ రాష్ట్రాలకు చెందిన రైతులు వ్యవసాయ కార్పొరేట్ చట్టాలను తక్షణమే రద్దు చేయాలంటూ రేయింబవళ్లు నిరవధిక ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం మాత్రం దున్నపోతు మీద వాన పడ్డ చిందంగా వ్యవహరిస్తూ రైతులను దగా చేస్తుందని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు రైతులకు మద్దతు ధరపై 50 శాతం అధికంగా నిర్ణయించి చెల్లిస్తామంటూ ఎన్నికల ముందు హామీని ఇచ్చి ఇప్పుడు తుంగలో తొక్కడం ఎంతవరకు సమంజసమని ఆయన తీవ్రస్థాయిలో ప్రశ్నించారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికలకు ముందు రైతు భరోసా పేరిట ఎకరానికి ఏడాదికి 15000 రూపాయలు చెల్లిస్తామంటూ అఫిడవిట్లో పేర్కొని ప్రస్తుతం మాత్రం కేవలం 12000 రూపాయలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి స్వామినాథన్ కమిషన్ సిపారస్లను అమలు చేయాలని లేని పక్షంలో దేశవ్యాప్తంగా రైతుల ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ప్రసాద్ టియుసిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు ,కార్మిక సంఘం నాయకులు వెంకటయ్య, మనివర్ధన్ ,వెంకటేష్ తదితరులతో పాటుగా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయం ఎదుట బిజెపి వినూత్న నిరసన ధర్నా

**ఆత్మకూరు జనవరి 8 ప్రభాతవార్త :** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ఆత్మకూరు మండల బిజెపి శాఖ ఆధ్వర్యంలో వినూత్నంగా మూతికి నల్ల గుడ్డలు కట్టుకుని నిరసన జరపడే కాకుండా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాను ద్వేషించి ఆత్మకూర్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అశ్విని కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు హైదరాబాదులోని బిజెపి కార్యాలయం పై అకారణంగా దాడులు నిర్వహించి ఫర్నిచర్ ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలంటూ ఎక్కడికక్కడ తమ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వానికి ఎటు పాలు పోకపోగా గుండాల మాదిరి రాష్ట్ర కార్యాలయాలపై దాడులు చేయడం తక్షణమే మానుకోవాలని లేనిపక్షంలో తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అంతేకాకుండా బిజెపి కార్యాలయం పై దాడి చేసిన వారిని తక్షణమే గుర్తించి అరెస్టు చేయాలని లేని పక్షంలో ప్రతిదారులకు పూనుకోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. అనంతరం ఆత్మకూరు తహశీల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మనోహర్ గౌడ్, ఎల్లన్న ,పనివర్ధన్ రెడ్డి ,విష్ణువర్ధన్ రెడ్డి ,మల్లేష్ ,బాలకృష్ణ తదితరులతో పాటుగా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటి పన్ను వసూలు లక్ష్యాన్ని చేరుకోవాలి

### జిల్లా పంచాయతీ అధికారి వెల్లడి

**ఆత్మకూరు జనవరి 8 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా వ్యాపితంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించినటువంటి రెండు కోట్ల 39 లక్షల ఇంటి పన్ను వసూలు లక్ష్యాన్ని పంచాయతీ కార్యదర్శులు చేరుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి సురేష్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం రోజు ఆత్మకూరు పట్టణంలోని ఎంపీపీ కార్యాలయ ఆవరణలో జరిగిన పంచాయతీ కార్మికుల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లా వ్యాపితంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు సంబంధించి 94 మేర సర్వే పూర్తయిందని త్వరలో ఆరు శాతాన్ని చేరుకోవడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించినటువంటి ఇంటి పన్ను వసూళ్ల లక్ష్యాన్ని కూడా పంచాయతీ కార్యదర్శులు పకడ్బందీగా వసూలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి కనీసం ఇప్పటివరకు 50 శాతం కూడా ఇంటి పన్ను వసూలు చేయకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ప్రభుత్వం భావించాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్నటువంటి ఓ పి ఎస్, జిపిఎస్ కార్యదర్శిలను నియామకాలు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని 12 గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో పాటుగా మండల ఏపీఓ శ్రీరామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రుద్రారంలో వీధి కుక్కల స్వైర విహారం

### గ్రామంలో పలువురిపై దాడి


వీధి కుక్కల దాడిలో గాయపడిన బాలుడు

**నవాబుపేట, జనవరి 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని గ్రామాల్లో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలను తీవ్ర భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయి. రుద్రారం గ్రామానికి చెందిన దుల్ల వీరేష్ కుమారుడు సాయి చరణ్‌పై దాడి చేసి గాయపరిచాయి. స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఆ గ్రామం,ఈ గ్రామం అనే తేడా లేకుండా గుంపులు, గుంపులుగా రోడ్లపై తిరుగుతూ చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు, సైకిల్, ద్విచక్రవాహన దారులను వెంబడించి పరుగుపెట్టిస్తున్నాయి. వీధికుక్కల స్వైర విహారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రివేళల్లో రోడ్లపైకి గుంపులు గుంపులుగా వచ్చి రోడ్లపై నుంచి వెళ్ళే వారిపై దాడులు చేస్తుండంతో కుక్కలు కనబడితే చాలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. రాత్రిపూట ప్రయాణించే ద్విచక్ర వాహన చోదకులను ఎక్కడో ఒక చోట వీధి కుక్కల వెంబడించి, గాయపరిచిన సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటి వరకూ మరో ముగ్గురిని గాయపరిచినట్లు గ్రామస్తులు తెలిపారు. ఒకవేళ ఏదైనా పెద్ద సంఘటన జరిగినప్పుడే అధికారు స్పందిస్తారు కావొచ్చు అని గుసగుసలు వినిపిస్తున్నాయి.

# ప్రేమించిన యువకుడు మరో యువతీతో ప్రేమలో పడ్డాడని యువతి ఆత్మహత్య

**ఖిల్లాఘణపురం జనవరి 8 ప్రభాతవార్త :** ప్రేమించిన యువకుడు మరో యువతితో చనువుగా ఉన్నాడని ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన చెరుక గోపమ్మ కూతురు రేవతి 22 సంవత్సరములు అదే గ్రామానికి చెందిన గాండ్ల భాను ప్రకాష్ ప్రేమ పేరుతో గత కొంతకాలంగా వేధిస్తున్నాడని గ్రామ పెద్దల సమక్షంలో పంచాయతీ నిర్వహించినప్పటికీ భాను ప్రకాష్ తన ప్రవర్తన మార్చుకోలేదని అతనిమాటలు నమ్మిన మృతురాలు రేవతి భాను ప్రకాష్‌కు బంగారంతోపాటు కొంత డబ్బు ఇచ్చినట్లు గోపెమ్మ తెలిపింది. ఈనెల 7న భాను ప్రకాష్ తన ఇన్స్టాగ్రామ్ ఖాతాలో యువతీతో చనువుగా ఉన్న ఫోటోలు పోస్ట్ చేయడంతో వాటిని చూసిన రేవతి తీవ్రంగా మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నదని,రేవతి ఆత్మహత్యకు కారకులైన భానుప్రకాష్‌తో పాటు అతని కుటుంబసభ్యులు ఆంజనేయులు,నాగరాజు,ప్రవీణ్ ,అంజలమ్మల పై మృతురాలి తల్లి గోపమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# రూ.500 బోనస్ జమ చేయాలి

### కొతలాబాద్ మాజీ ఎంపిటిసి రాజిరెడ్డి

**కోయిలకొండ, జనవరి 8 ప్రభాతవార్త :** వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు అమ్మిన రైతులకు ప్రభుత్వం వెంటనే 500 బోనస్ రైతుల అకౌంట్లో జమ చేయాలని కో త లాబాద్ మాజీ ఎంపిటిసి రాజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యాసంగి సీజన్లో వరి నాట్లు వేయడానికి రైతులు దగ్గర డబ్బులు లేక చాలా ఇబ్బందిగా ఉన్నారని తెలియజేశారు. అదేవిధంగా కొంతమందికి రైతులకు వరి ధాన్యం డబ్బులు పడలేక నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. కొంతమంది రైతులకు బోనస్ వేయకుండానే వరి ధాన్యం డబ్బులు రైతు ఖాతాలో జమ చేశారని సూచించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుల ఖాతాలో బోనస్ వెంటనే జమ చేసి ఆదుకోవాలని ఆయన కోరారు.

# ఎమ్మెల్యే కాన్వాయ్‌ని అడ్డుపడ్డ బిజెపి నాయకులు

మొదటి పేజీ తరువాయి భాగం

నిరసన తెలిపేందుకు అనేక మార్గాలు ఉన్నాయని, అయితే రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బాధ్యత మరచి ఇతర పార్టీ కార్యాలయాల పై దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు తరాలకు ఏం సందేశమిస్తోందో చెప్పాలన్నారు. సమాజంలో దాడులు, ప్రతి దాడులు చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. ఇప్పటికైనా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీ కార్యాలయంపై దాడి చేసిన యూత్ కాంగ్రెస్ కార్యకర్తలతో బేషరతుగా క్షమాపణ చెప్పించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పర్వతాలు కృష్ణా నవీన్ నరసింహ ఆంజనేయులు బాలకృష్ణ రాము శేఖర్ ఉన్నారు.

## 24 గంటలలోనే కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీస్‌లు

**జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేసిన బాధిత కుటుంబ సభ్యులు**



జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

**గద్వాల జనవరి 8 ప్రభాతవార్త:** ఆపద సమయంలో పోలీస్ వారు అందించిన తక్షణ సేవలను ప్రజలు గుర్తించి సంతృప్తి వ్యక్తపరచడం ఏంతో అభినందనీయం అని జిల్లా ఎస్పీ శ్రీ టి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం శాంతి నగర్ పట్టణానికి చెందిన కిరణం వ్యాపారి రమేష్ కిడ్నాప్ కేసును కేవలం 8 గంటలలో ఛేదించిన సందర్భంగా బాధితుడి కుటుంబ సభ్యులు, సన్నిహితులు బుధవారం జిల్లా ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ కిడ్నాప్ అయిన భర్త నుండి ఫోన్ రాగానే భార్య అనుమానాస్పదంగా భావించి వెంటనే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు ఇవ్వడం అభినందనీయం అని, వెంటనే పోలీస్ వారిని సంప్రదించడం ద్వారా పోలీస్ అధికారులు, సిబ్బంది, ఐటీ సెల్ సిబ్బంది ఏంతో శ్రమించి కేవలం 8 గంటలలో హైదరాబాదు వెళ్లి కేసును చేదించగలిగారు అని అన్నారు. ఇలా సమస్యలు వచ్చినప్పుడు ప్రతి మహిళ పోలీస్ స్టేషన్ ను గుర్తించుకొని వచ్చి జరిగిన అన్యాయంపై ధైర్యంగా ఫిర్యాదు ఇవ్వగలగాలి అని అప్పుడే వీలైనంత త్వరగా పోలీస్ యంత్రాంగం సమస్యను పరిష్కరించే దిశగా కృషి చెయ్యడం జరుగుతుందని ఎస్పిగా అన్నారు. మిస్సింగ్ కేసులలో ముఖ్యంగా మహిళల మిస్సింగ్ కేసులలో పోలీస్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తమై ఛేదించి విధంగా కృషి చేస్తుందని అన్నారు. కిడ్నాప్ కేసు వివరాలు శాంతినగర్ టౌన్ కు చెందిన కిరణం షాప్ యాజమాని మలే రమేష్ బాబుకు తాను అప్పు ఇచ్చిన నూగల రామయ్య, బావమరిది శ్రీనివాస్‌ను అంటూ ఒక వ్యక్తి ఫోన్ చేసి మీకు మా భావ ఇవ్వాల్సిన అమోంట్ వడ్డీతో ఇస్తామని సోమవారము ఫోన్ చెయ్యగా అతను మాటలు నమ్మి రమేష్ బాబు హైదరాబాదు వెళ్లి అక్కడకు వచ్చాను అని ఫోన్ చెయ్యగా తాను రిజిస్ట్రేషన్ ఆఫీస్‌లో ఉన్నానని నాగోల్ చౌరస్తాకు వెళ్ల అక్కడ మా తమ్ముడు ఉంటాడు డబ్బులు ఇస్తాడు అని చెప్పగా వారి మాటలు నమ్మిన రమేష్ బాబు ఆరంఘర్ చౌరస్తా నుండి నాగోల్ కు వెళ్ళగా,అక్కడకు ఒక వ్యక్తి వచ్చి శ్రీనివాస పంపించాడు అనీ రమేష్ కు చెప్పి ఆదిత్యనగర్‌లో ఉన్న ఇంటి వద్దకు వచ్చి డబ్బులు తీసుకుని వెళ్ళమన్నాడు అని చెప్పి రమేష్‌ను తిసుకొని ఆటోలో ఒక ఇంటికీ వెళ్ళడం జరిగింది. ఇక్కడికి వచ్చాక ఇంట్లో నలుగురు వ్యక్తులు మంకీ క్యాపులు, బ్లాక్ స్వెటర్స్ వేసుకొని ఉన్న వ్యక్తులు రమేష్‌ను గట్టిగా పట్టుకొని కుర్చీలో కూర్చోబెట్టి చేతులు, కాళ్ళను తాడుతో కట్టి రూములో బంధించి చేతులతో కొట్టి ఫోన్ తీసుకొని మాకు డబ్బులు అవసరం ఉన్నాయి వెంటనే 50 లక్షల రూపాయలు కావాలి మీకు తెలిసిన వాళ్ళతో తెప్పించు లేదంటే నిన్ను చంపేస్తామని బెదిరించడం జరిగిందన్నారు. మరల కొద్దిసేపటి తర్వాత నీకు తెలిసిన దోస్తులు ఎవరైనా ఉంటే 10 లక్షల రూపాయలు క్యాష్ తెప్పించు లేదంటే ట్రాన్స్ఫర్ చేయించు అన్ని చెప్పగా, రమేష్ స్నేహితులైన శివ నారాయణకి ఫోన్ చేసి పదిలక్షల రూపాయలు తీసుకొని హైద్రాబాద్‌కి తీసుకొని రమ్మని చెప్పించారు. రమేశ్ భార్య సుభాషిణి కు అనుమానం రాకుండా ఉండడం కోసం వాళ్లు రమేష్ యొక్క నెంబర్ నుండి తనభార్య ఫోన్‌కి ఫోన్ చేయించి నాకు ఫిట్స్ వచ్చి కింద పడిపోయిన్నాను ఏమి కాలేదు డాక్టర్ వద్ద చూయించుకుని వస్తానని చెప్పమని చెప్పగా రమేష్ అదే విధంగా తన భార్యతో ఫోన్లో చెప్పించారు. ఈ విషయంలో భార్యకు అనుమనం రాగ వెంటనే పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు ఇవ్వగా శాంతినగర్ ఎస్సై సంతోష్ ఈ విషయం శాంతి నగర్ సీఐ టాటా బాబు, డి.ఎస్పి మొగిలయ్య,జిల్లా ఎస్పీకి తెలియజేయగా జిల్లా ఎస్పీ వెంటనే ఇన్వెస్టిగేషన్ ప్రారంభించిన కేసును చేదించాలని అధికారులను ఆదేశించడం జరిగింది. రమేశ్ ఫోన్ కాల్, ఇతర సాంకేతిక పరిజ్ఞానంతోవారి లొకేషన్‌ను శాంతి నగర్ పోలీసులు గుర్తించి ప్రత్యేక వాహనంలో ఇద్దరు కానిస్టేబుళ్లను అక్కడకు పంపించి రమేష్‌ను బంధించిన ఇంటిని చేరడం జరిగింది. పోలీసులను చూసిన నిందితులు కొందరు పారిపోగా ఇద్దరినీ అదుపులోకి తీసుకుని మళ్లీ కారులో బాధితుడిని తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగింది. పోలీసులు తీసుకున తక్షణ చర్య ద్వారా బాధితుడు ,కుటుంబ సభ్యులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## అట్టహాసంగా మేఘా రక్తదాన శిబిరం

- ఎమ్మెల్యే మేఘారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని రక్తదాన శిబిరం
- 559 యూనిట్లతో జిల్లాలోనే మొట్టమొదటిసారిగా రక్త సేకరణ



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**వనపర్తి ప్రతినిధి జనవరి 8 ప్రభాత వార్త:** ఎమ్మెల్యే మేఘారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో వనపర్తి జిల్లాలోనే మొట్టమొదటిసారిగా 559 యూనిట్ల రక్తం సేకరించినట్లు జిల్లా వైద్యాధికారులు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, పట్టణ అధ్యక్షుడు చిట్ల చందర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. జిల్లాలోనే మొట్టమొదటిసారిగా ఒక రోజు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 559యూనిట్ల రక్తం సేకరించడం ఇదే మొదటి సారి అని వైద్యాధికారులు వెల్లడించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసినందుకు ఎమ్మెల్యే మేఘారెడ్డి వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## యంగ్ ఇండియాకే బోల్ పోస్టర్ల ఆవిష్కరణ

**మహబూబ్‌నగర్, జనవరి 8 ప్రభాతవార్త:** మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం యంగ్ ఇండియాకే బోల్ సీజన్ 5 పోస్టర్లను యువజన కాంగ్రెస్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ అవేజ్ అహ్మద్ మాట్లాడుతూ ఆలిండియా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆసక్తిగల యువత ఐవైసీ వెబ్‌సైట్ లో ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై, దేశంలో సామాజిక న్యాయం కోసం అంబేద్కర్ చేసిన కృషిపై 90 సెకండ్లతో కూడిన ఉపన్యాస వీడియోను అపలోడ్ చేయాలని, ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సంధ్య,జిల్లా ప్రధాన కార్యదర్శులు సంజీవరెడ్డి, ఇంతియాజుద్దీన్, మహబూబ్‌నగర్ అసెంబ్లీ అధ్యక్షులు సల్మాన్, జడ్చర్ల అసెంబ్లీ అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి, నాయకులు ముస్తాక్‌అలీ, వంశీ, పవన్ కల్యాణ్, శ్రీశైలం, గణేష్, కృష్ణ, నీలకంఠ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సైబర్ నేరగాళ్ల వలలో పడకండి

**వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించండి : ఎస్ఐ తిరుపాజి**

**బాలానగర్, జనవరి 8 ప్రభాతవార్త:** బాలానగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమాన్ని ఎస్ఐ తిరుపాజి నిర్వహించారు. అనంతరం రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా రోడ్డుపై వాహనదారులకు ట్రాఫిక్ నియమ నిబంధనల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులందరూ ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించి క్షేమంగా గమ్యం చేరుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు పెట్టుకోవాలని ఆయన సూచించారు. మద్యం సేవించి వాహనం నడప రాదని, వేగ పరిమితిలో వాహనాలు నడిపి క్షేమంగా గమ్యం చేరాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తిరుపాజితో పాటు కానిస్టేబుల్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రోడ్డు భద్రత మాసోత్సవాలు

**నారాయణపేట టౌన్, జనవరి 8 ప్రభాతవార్త :** రోడ్డు భద్రత మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం నారాయణపేట ఆర్టీసీ డిపోలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో గ్రౌండ్ స్కూల్ విద్యార్థినిలు, డిపో మహిళా ఉద్యోగులు పాల్గొ న్నారు. ముగ్గులను డిపో మేనేజర్ పరిశీలించారు. అనంతరం ముగ్గుల పోటీలో పాల్గొన్న వారందరికీ డిపో మేనేజర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సెక్యూ రిటీ హెడ్ కానిస్టేబుల్ షేక్ జానీ, మెకానికల్ ఇన్చార్జి చంద్ర నాయక్, ట్రాఫిక్ ఇంచార్జి వహీద్ కంట్రోలర్ ఆంజనేయులు రవికుమార్ చాంద్ పాషా సెక్యూరిటీ కానిస్టేబుల్ మహమ్మద్ ఖాజా,సల్మాన్‌డిపో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## పాఠశాలల్లో రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలి

■ **నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్

**నారాయణపేట టౌన్, జనవరి8 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలలో రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలను చివరగా ఏ అధికారి విజిట్ చేశారని హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. చివరగా ఎంపీడీఓ పాఠశాలను విజిట్ చేసినట్లు తెలుసుకున్న కలెక్టర్ విజిటర్ రిజిస్టర్‌ను చూశారు. కానీ అందులో ఎంపీడీఓ విజిట్ చేసినట్లు సంతకం లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎవరైనా జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాఠశాల విజిట్‌కు వస్తే వారితో రిజిస్టర్‌లో సంతకాలు తీసుకోవాలని సూచించారు. అలాగే ఫుడ్ టేస్ట్ రిజిస్టర్, అకాడమిక్ గైడెన్స్ రిజిస్టర్, స్టూడెంట్ ఫుడ్ కమిటీ రిజిస్టర్, స్టాక్ రిజిష్టర్లను సక్రమంగా నిర్వహించాలన్నారు.పాఠశాలలో మధ్యాహ్నం భోజనం టేస్ట్ చేసిన తర్వాత భోజనం ఎలా ఉందో రిమార్క్ ను రిజిస్టర్‌లో రాయాలన్నారు. గుడ్, యావరేజ్, నార్మల్ ఇలా మూడు రకాల అభిప్రాయాలను తప్పనిసరిగా రాస్తేనే మరుసటి రోజు ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటారని చెప్పారు. మెను పట్టికను చూశారు. 6వ తరగతి గదిలోకి వెళ్ళిన కలెక్టర్ విద్యార్థులు కింద కూర్చోవడం చూసివిద్యార్థులకు సరిపడా బెంచీలు లేవా అని ప్రశ్నించారు. ఒక్కో తరగతిలో ఎక్కువ సంఖ్యలో ఉన్నారని, తెలుగు, ఇంగ్లీష్ తరగతులను కంబైడ్ గా నిర్వహించడం వల్ల బెంచీలు సరిపోవడం లేదని హెచ్‌ఎం తెలిపారు. అయితే ఎంత మంది విద్యార్థులు హాజరయ్యారు, ఎంత మంది గైర్హాజరు అయ్యారో బోర్డు మీద రాయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలపై అంతస్తులో గల ఓపెన్ హాల్‌కు ఎందుకు తాళం వేశారని అడిగారు. ఓపెన్ హాల్ నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ తనకు బిల్లు చెల్లించలేదని హాల్‌కు తాళం వేసుకుని వెళ్లారని డీఈఓ గోవిందరాజులు కలెక్టర్‌కు తెలిపారు.నిర్మాణం పూర్తయిన తర్వాత బిల్లు ఇచ్చినా ఇవ్వక పోయినా తాళం వేసుకుని వెళ్లరాదని, వెంటనే హాల్‌ను తెరిపించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం పాఠశాలలో బియ్యం బస్తాలను కలెక్టర్ పరిశీలించారు. బియ్యం, వంటకు వినియోగించే సరకులను నిల్వ ఉంచే గది ఎల్లపుడూ శుభ్రంగా ఉండేటట్లు చూడాలన్నారు. అలాగే రాగి జావ సామాగ్రిని కూడా ఆమె చూశారు. స్టాక్ నిల్వ ఉంచే గదిలో సెల్ఫ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గత నెల బియ్యం స్టాక్ ఎప్పుడూ వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగది లోకి వెళ్ళిన కలెక్టర్ అక్కడ విద్యార్థులకు వండుతున్న అన్నం, పప్పు ను చూసి మెనూ ప్రకారం పప్పుతో పాటు కర్రీ కూడా వండాలని ఎందుకు వడ లేదని ఏజెన్సీ యువకులను నిలదీశారు.మెనూ ప్రకారమే బిల్లులుతీసుకుంటున్నారని అలాంటప్పుడు మెనూ ప్రకారమే పెట్టాలని తేల్చి చెప్పారు. తమకు గత ఆరు నెలలుగా బిల్లులు రాలేదని వంట ఏజెన్సీ నిర్వాహకులు కలెక్టర్‌కి తెలపడంతో సంతృప్తి చెందని ఆమె ఎన్ని సంవత్సరాలుగా ఏజెన్సీ నడుపుతున్నారని కలెక్టర్ ప్రశ్నించగా 20 సంవత్సరాల నుంచి నడుపుతున్నట్లు ఏజెన్సీ నిర్వాహకురాలు చెప్పడంతో 6 నెలల బిల్లులు రాకపోతే మెనూ ప్రకారం భోజనం పెట్టరా ? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మెనూ పాటించని ఏజెన్సీ నిర్వాహకురాలికి మెమో జారీ చేయాలని డీఈఓను ఆదేశించారు. మొత్తం పాఠశాల విజిట్లకు సంబంధించిన అన్ని రకాల రిజిస్టర్లను పరిశీలించి, పూర్తిస్థాయిలో రిపోర్ట్ తనకు ఇవ్వాలని డీఈఓను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, మున్సిపల్ కమిషనర్ సునీత, పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వహణ సమన్వయకర్త యాదయ్య శెట్టి పాల్గొన్నారు.

## పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : జిల్లా కలెక్టర్





**నారాయణపేట టౌన్, జనవరి 8 ప్రభాతవార్త :** పదవ తరగతి పరీక్షా ఫలితాలలో జిల్లాలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. గతేడాది పది లో సాధించిన ఉత్తీర్ణత కంటే ఈ సారి మెరుగు పడాలన్నారు. గతేడాది ఉత్తీర్ణత శాతం పెంచడానికి నిర్వహించిన ప్రత్యేక తరగతులు, విధానాలను అమలు చేసి పదిలో వంద శాతం ఫలితాలు రాబట్టాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాలోని కాంప్లెక్స్ హెచ్ ఎంలతో పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంపు పై ఏర్పాటు చేసిన సమావేశానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలల వారీగా ఎస్. ఏ 1 ఫలితాలపై సమీక్షించారు. ఎస్ ఎ 1 ఫలితాలు ఆశాజనకంగా లేవని, ఇంకా మెరుగు పడాలని ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు సూచించారు.గతేడాది వందశాతం ఉత్తీర్ణత సాధించిన పాఠశాలలో అవలంభించిన విధి విధానాల గురించి చర్చించారు.ఈసారి ముందస్తుగా తగిన ప్రణాళిక రూపొందించుకుని ఫలితా లలో జిల్లా రాంక్యును గతే దాదికంటే మెరుగైన స్థానంలో నిలిచేలా విద్యాధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆమె కోరారు. ముఖ్యంగా వెనకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా వ్యక్తిగత శ్రద్ధ చూపి వారిని ఆయా సబ్జెక్టులలో మంచి మార్కులుసాధించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాల్లో క్యాటగిరి వారీగా విద్యార్థుల జాబితాను రూపొందించి సీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వెనుక బడిన సబ్జెక్టులలో ముందు ఉండేలా మెలకువలు నేర్పించాలని సూచించారు. పక్షం రోజుల తర్వాత మళ్ళీ సమీక్ష చేద్దామని, అంతలోపు విద్యార్థుల విద్యా నైపుణ్య సామర్థ్యాల పెంచేందుకుతగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశిం చారు.ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ గరీమా నరుల,డీఈఓగోవిందరాజులు,సెక్టోరియల్‌అధికారులు పాల్గొన్నారు.

## బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

■ **గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు** ■ **ఆపరేషన్ స్మైల్-11 బృందం తనిఖీల్లో 11 మంది బాలలకు విముక్తి**





బాల రక్షా భవన్ వద్ద బాలకార్మికులు

**గద్వాల జనవరి 8 ప్రభాతవార్త:** 18 సంవత్సరాలలోపు బడి ఈడు కొచ్చిన పిల్లలు బడిలో ఉండాలని, చిన్నపిల్లలు వెట్టిచాకిరికి గురి కాకుండా వారి మొహంలో చిరునవ్వులు చిందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, జిల్లాలో ఎవరైనా బాల బాలికలను హోటల్స్, షాప్స్‌లలో బాల కార్మికులుగపనిలో పెట్టుకున్న, వ్యవసాయ, ఇతర పనులలో పెట్టుకున్న అట్టి వారిపై కఠినంగా వ్యవహ రించి క్రిమినల్ కేసులు నమోదు చెయ్యడం జరుగుతుందని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ఐపీఎస్ తెలిపారు. జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్-11 బృందం రోడ్డుపై భిక్షాటన చేస్తున్న చిన్నారులను, హోటల్స్, షాప్స్,ఇటుక బట్టీలలో, పౌల్ట్రీ ఫామ్‌లలో పని చేస్తున్నా బాల కార్మికులను, మరే ఇతర ప్రదేశాలలో తప్పిపోయిన వదిలివేయబడిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి వారికి అప్పగి ంచడం, లేదా స్టేట్ హోమ్‌కు పంపించడం జరుగుతుందని అన్నారు. ఆపరేషన్ స్మైల్-11 బృందం బుధవారం నిర్వహించిన తనిఖీలో గద్వాల్ మండలం కుర్వపల్లి గ్రామ శివారులో పరుశురాముడు అను భూ యజమాని తన మిరప చేనులో బాల, బాలికలతో పనులు చేస్తుండగా ఆపరేషన్ బృందం ఇంచార్జి ఎస్సై కేశవరావు, లేబర్ అధికారి మొహిన్, ఐసీడి ఎస్ అధికారి లక్ష్మి దేవి, చైల్డ్ హెల్ప్ లైన్ అధికారి కళావతి, ఎన్‌జిఓ లత పోలీస్ బృందం రిస్క్ చేసి వారిని పట్టుకొని విచారించగా స్కూలు మాని 250/- రూపాయలకు మీరప చేనులో బాలకార్మికులుగా పని చేయించుకుంటున్నట్లు గుర్తించడం జరిగింది, ఈ చర్య బాలకార్మిక చట్టం ప్రకారం నేరం కావున వారిని ఆపరేషన్ స్మైల్ బృందం తీసుకువచ్చి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ముందు హాజరుపరచి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ చేసి, తిరిగి స్కూలు కు వెళ్ళేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అలాగే చిన్నారులను బాల కార్మికులుగా పనిలో పెట్టుకున్నా పరుష రాముడుపై కేసునమోదు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ తెలిపారు. జిల్లాలోఎవరైనా 18 సంవత్సరాల లోపు చిన్నారులకుబలవంతంగా పని చేయించిన, ఒంటరిగా బాధపడుతున్న బాలలను చూసినప్పుడు, ఆశ్రయం అవసరమైన బాలలను తప్పిపోయిన, వదిలివేయబడిన బాలలను చూసినప్పుడు, శారీరకంగా మానసిక, లైంగిక దోపిడికి గురవుతున్న బాలలను, ఆర్థికంగా దోపిడీకి గురవుతున్న బాలకార్మికులను చూసినప్పుడు, హింసకు బెదిరింపులకు గురవుతున్న వీధి బాలలను చూసినప్పుడు, 1098 లేదా డయల్ 100, ఆపరేషన్ స్మైల్ బృందానికి ఫోన్ చేసి సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్పీ పేర్కొన్నారు.

## ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి
- జిల్లాను యాక్సిడెంట్స్ ఫ్రీగా మార్చడానికి అన్ని రకాల చర్యలు: వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి
- మైనర్ పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదు : ఎస్పి రావుల గిరిధర్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

**వనపర్తి టౌన్ జనవరి 8 ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని, పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు తల్లి దండ్రులు ఒకసారి ఆలోచించాలని ఎమ్మెల్యే మేఘా రెడ్డి అన్నారు. బుధవారం రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ రేట్ ప్రాంగణం నుండి నల్ల చెరువు వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి, జిల్లా కలెక్టర్, ఎస్పీతో కలిసి జెండా ఊపి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రతకు ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలని పిల్లలకు వాహనాలు ఇచ్చే ముందు తల్లిదండ్రులు ఒకసారి ఆలోచించాలని గుర్తు చేశారు.పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రతిరోజు రోడ్డు భద్రతపై కొంత అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలు పాటించని వారికి తాము కూడా ఎప్పటికీ సహకరించబోమని కరాఖండిగా చెప్పారు.జిల్లా రవాణాశాఖ అధికారులు లైసెన్సులు జారీ చేసేవిషయంలో దృష్టి పెట్టి పకడ్బందీ రోడ్డు భద్రత నియమాలు అమలు చేయాలన్నారు. అదే విధంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మరణాలు సంభవిస్తున్నందునే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు భద్రతా వారోత్సవాలనుంచి మాసోత్సవాలుగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని,



రోడ్డు ప్రమాదాల కారణంగా నష్టపోతున్న వారిలో 60 నుంచి 70 శాతం యువతే ఉన్నారని చెప్పారు. కాబట్టి రోడ్డు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్ల కుటుంబానికి కలిగే నష్టాన్ని ఎవరు పూడ్చలేరని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. జిల్లాను యాక్సిడెంట్స్ ఫ్రీగా మార్చడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామని చెప్పారు. త్వరలోనే ఆర్టీసీ డ్రైవర్లకు సైతం కంటి పరీక్షల క్యాంపును నిర్వహిస్తామని తెలియజేశారు. ఎస్పీ గిరిధర్ రావుల మాట్లాడుతూ సమాజం మనకు ఎంతో ఇస్తుందని, కాబట్టి మనం కూడా ఇతరులకు ఇబ్బంది కలగకుండా చక్కగా రోడ్డు భద్రత పాటిస్తూ బాధ్యతగా మెలగాలన్నారు.ఇటీవల కాలంలో ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నామన్నారు.ఇప్పటివరకు 50 మంది రోడ్డు భద్రతనియమాలు పాటించని కారణంగా జైలుకు వెళ్లారని చెప్పారు. కాబట్టి రాష్ డ్రైవింగ్ చేసి కష్టాల పాలవకుండా బాధ్యతగా ఉండాలన్నారు.గతఏడాదికాలంలో దేశంలోరోడ్డు ప్రమాదాల కారణంగా1.70 లక్షల మంది మరణించినట్లు గుర్తు చేశారు. బైక్ ర్యాలీసందర్భంగా నల్లచెరువు కట్టపైరోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ తెలంగాణ సాంస్కృతిక సారధి, పాఠశాల విద్యార్థులతో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తక్షణం స్పందించి సహాయం చేస్తున్న శ్రీనివాస్ అనే యువకుడిని సన్మానం చేసి హెల్మెట్‌ను బహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి మానస, జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారాం, యువజన సర్వీసుల శాఖ అధికారి సుధీర్ రెడ్డి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి అంజయ్య ఇతర అధికారులు, విద్యార్థులు, యువత, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి భాగం..

ఆదేశించారు. ఇందుకోసం ఒక్కో జిల్లాలో 100 నుంచి 150 ఎకరాల వరకు ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని సూచించారు. విద్యుత్, టీజీ రెడ్‌కో ద్వారా త్వరలో టెండర్లు ఖరారు చేస్తామన్నారు. ఈ అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకొని కలెక్టర్లు జనవరి 20వ తేదీ లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. స్థల గుర్తింపు పూర్తి అయిన తర్వాత బ్యాంకర్లతో మాట్లాడి సపోర్ట్‌సిస్టంను ఏర్పాటుచేయాలని చెప్పారు.మహిళా సంఘాలు సోలార్ పవర్ ప్లాంట్‌ల ఏర్పాటుకు వారికి అందుబాటులో ఉన్న భూమిని గుర్తించండి, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని గుర్తించాలని కలెక్టర్లను ఆదేశించారు.మహిళా సంఘాలు ప్లాంట్ల ఏర్పాట్లలో ఆర్థిక సహాయం కోసం బ్యాంకు అధికారులతో సమన్వయం చేయాలని సూచించారు. మహిళా సంఘాల భూముల్లో ప్లాంట్ లో ఏర్పాటుకు విద్యుత్ శాఖ రెడ్కో ద్వారా టెండర్లు ఆహ్వానించిందని, త్వరలో టెండర్లు ఓపెన్ చేసి వాటిని ఖరారు చేస్తారని డిప్యూటీ సీఎంతెలిపారు. ఈ నేపథ్యంలో సంఘాలను గుర్తించి నిర్ధారించడం, భూ సేకరణ, బ్యాంకుల నుంచి ఆర్థిక సాయంవంటి పనులను గ్రామీణ అభివృద్ధి శాఖ, జిల్లా కలెక్టర్లు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ఒక మెగావాటు ఉత్పత్తికి నాలుగు ఎకరాలు అవసరం ఉంటుంది. ప్రతి జిల్లాలో 150ఎకరాలకు తగ్గకుండా రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగు వేల ఎకరాలు సేకరించాల్సి ఉంటుందని కలెక్టర్లకు తెలిపారు. దేవాదాయ,ఇరిగేషన్ శాఖలపరిధిలోని భూములను గుర్తించాలని కేంద్ర అటవీహక్కుల చట్టం ప్రకారం గిరిజనులు భూమి అభివృద్ధి చేసుకునే అవకాశం ఏర్పడిందని తెలిపారు. వనపర్తి జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయక బృందాల ద్వారా సోలార్ ప్లాంట్ల ఏర్పాటు విషయమై వనపర్తి జిల్లాలో ఇప్పటికే 15 ఎకరాల స్థలాన్ని గుర్తించడం జరిగిందని, మిగతా త్వరలోనే గుర్తిస్తామనిబదులిచ్చారు.నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 36 ఎకరాలు గుర్తించినట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా 150ఎకరాలను గుర్తించి ఈ నెల20 లోపు నివేదికలు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వనపర్తి జిల్లా నుండి డిఆర్‌డిఓ ఉమాదేవి, డిఎల్‌పిఓ రఘునాథ్, అటవీ అధికారి నిఖిల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, నారాయణపేట జిల్లానుండి ట్రైని కలెక్టర్‌గారిమా నరుల ఆర్.డి.ఓ. రాంచందర్ డి.ఆర్.డి.ఎ.మొఘలాప్పసంబంధితఅధికారులు పాల్గొన్నారు.

### గణతంత్ర దినోత్సవ వేడుకలకు మహిళా రైతుకు రాష్ట్రపతి ఆహ్వానం



మహిళా రైతు లావణ్యకు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న తపాలా ఉద్యోగులు

**తెలకపల్లి, జనవరి 8 ప్రభాతవార్త:** ఈనెల 26న దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఎట్ హోమ్ రాష్ట్రపతి" కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని కార్వంగ గ్రామానికి చెందిన సేంద్రీయ వ్యవసాయ మహిళా రైతు కే లావణ్య రమణారెడ్డికి భారత రాష్ట్రపతి నుంచి ఆహ్వానం రావడంతో ఆ ఆహ్వాన పత్రికను మహిళ రైతుకు బుధవారం సాయంత్రం అందజేసినట్లు నాగర్‌కర్నూల్ సబ్ డివిజన్ అధికారి సృజన్ నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ ఎంవో మహిమూద్ ఖాన్, బ్రాంచ్ పోస్టు మాస్టర్లు ప్రియాంక, జి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

### హత్య కేసులో నిందితునికి జీవిత కారాగార శిక్ష

**వనపర్తి క్రైమ్ జనవరి8 ప్రభాతవార్త:** హత్యానేరం ఋజువైనందున నేరస్తునికి జీవిత కారగార జైలు శిక్షతో పాటు7,000/- రూ.జరిమానా విధించిన వనపర్తి జిల్లా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం ఆర్, సునీత బుధవారం తీర్పు ఇవ్వడం జరిగిందని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. కేసు యొక్క వివరాలు తెలిపిన జిల్లా ఎస్పీ ఆత్మకూరు పోలీస్టేషన్ పరిధిలోని బాలకిష్టపూర్ తాండకు చెందిన మూడవత్ మణెమ్మ ను భర్త గోపాల్ నాయక్ పెట్రోల్ పోసి తగులబెట్టి చంపినందున కొడుకు కృష్ణ ఫిర్యాదు పై నవంబర్ 05, 2020, తేదీన అప్పటి ఆత్మకూరు ఎస్సై, ముత్తయ్య సిఆర్.నంబర్ 106/2020 యు/ఎస్ 302, 498 (ఎ) ఐపిసినందు కేసు నమోదు చేయగా తేదీ 20.12.2020 రోజు మృతురాలు మరణించగా అప్పటి సీఐ సీతయ్య ఇన్వెస్టిగేషన్ ప్రారంభించారు.మృతురాలు ఇచ్చిన మరణ వాంగ్మూలంపై విచారణ జరిపి భార్యను వేధింపులకు గురిచేసి పెట్రోల్ పోసిచంపిన నిందితుడు మూడవత్ గోపాల్ పై అప్పటి సీఐ సీతయ్య ఛార్జ్ షీట్ ఫైల్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. ప్రస్తుత సీఐ, శివకుమార్ ఎస్సై, నరేందర్ ఆదేశాల మేరకు కోర్టు లైజనింగ్ అధికారి హెడ్ కానిస్టేబుల్, సత్యం, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు రాజేందర్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. గోపాల్‌రెడ్డి కోర్టులో వాదనలు వినిపించగా నేరస్తునిపై నేరం నిరూపణ అయినందున బుధవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత తీర్పు వెలువరించడం జరిగిందని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. ఈ కేసులో నేరస్తునికి శిక్ష పడడంలో బాగా పనిచేసినపోలీస్ అధికారులను, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను, కోర్టు డ్యూటీ ఆఫీసర్లను ఎస్పీ అభినందించి త్వరలో రివార్డుఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీమాట్లాడుతూ సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ కూడా శిక్ష నుండి తప్పించుకోలేరని, ప్రజలు ఎవరు కూడా చట్టాన్నితమ చేతిలోకి తీసుకోవద్దని ఎస్పీ తెలిపారు. పోలిసులు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ న్యాయ నిరూపణజరిపికచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు.

### గ్రామీణ అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్యం

**వనపర్తి టౌన్ జనవరి 8 ప్రభాతవార్త :** 18 నుండి 60 సంవత్సరాలు వయస్సు ఉండి నాణ్యమైన వ్యవసాయ, అనుబంధ రంగాలలో వ్యాపార అవకాశాలు ఉన్నవారికి, శ్రామిక వేత్తలుగా, వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు నాబార్డ్, బ్యాంకింగ్ వ్యవస్థలు లోన్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాయని నాబార్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీకాంత్ జామ్రే అన్నారు. పెద్దమందడి మండలంలోని మోజర్ల ఉద్యాన కళాశాలలో కళాశాల, నాబార్డ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన అగ్రిక్లినిక్, అగ్రి బిజినెస్ సెంటర్‌పై సన్నెజేషన్ వర్క్‌షాప్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ అభివృద్ధితోనే దేశ అభివృద్ధి సాధ్య మవుతుందని, అందులో రైతుల పాత్రఅత్యంత కీలకమని అన్నారు.వ్యవసాయ, అనుబంధ రంగాలలో వ్యాపారాత్మక ధోరణిని పెంపొందించేం దుకు నాబార్డ్ కృషి చేస్తుంది అన్నారు. బ్యాంకుల ఆర్థిక సహాయంతో రైతాంగం, ఉద్యాన, వ్యవసాయ రంగాలలో ఆసక్తి ఉన్నవారు, నిపుణులఎంటర్ప్రెన్యూర్షిప్ అభివృద్ధిచేయడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. అగ్రిక్లినిక్, అగ్రి బిజినెస్ సెంటర్ పథకం కింద ఇంటర్మీడియట్ నుండి పోస్ట్ గ్రాడ్యుయేట్ అభ్యర్థులకు 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చి, ఒక వ్యక్తికి 20 లక్షల వరకు, అలాగే ఐదుగురు ఉన్న గ్రూప్ కి కోటి రూపా యల వరకు ప్రాజెక్టు కాస్టు ఇవ్వనున్నట్టు తెలిపారు. జనరల్ కేటగిరీకి 30, మహిళలుఎస్సీ,ఎస్టీలకు 44 శాతం సబ్సిడీ ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అధికా రులు గోవింద నాయక్ తో పాటు వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, గద్వాల్, నారాయణపేట జిల్లాలోని అన్ని బ్యాంకుల రీజినల్ మేనేజర్స్, డిస్టిక్ లీడ్ మేనేజర్స్, బ్రాంచ్ మేనేజర్లు, అంకుర పరిశ్రమల అధికారులు,అగ్రికల్చర్ కాలేజ్, ఫిషరీ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రిన్సిపాల్‌లు,ఎఫ్‌ఈఓలు, ప్రొఫెసర్లు విద్యార్థులు పాల్గొన్నారు.